క్లుప్తంగా

భూసార పరీక్షలతో పుడమికి ఆరోగ్యం

ఏర్పేడు: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని పంటలు సాగు చేస్తే నేలతల్లి ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని బండారుపల్లెలో శుక్రవారం పీఎం ఆర్‌కేవీవై పథకం కింద రైతులకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయనతోపాటు ఏవో సాగరిక మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా ఆ నేలకు అవసరమైన ఎరువులను మాత్రమే వాడితే సరిపోతుందన్నారు. ఆహార భద్రత లభిస్తుందన్నారు. అనవసరంగా రసాయన ఎరువులను వాడటం వల్ల నేల సారాన్ని కోల్పోతుందన్నారు. అంతేకాకుండా కాలక్రమంలో ఆ భూములు చౌడుబారుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాగరిక పాల్గొన్నారు.

నూతన సిబ్బందితో పెన్షనర్ల అవస్థలు

రేణిగుంట: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్ద పెన్షన్ తీసుకుంటున్న వృద్ధులు ప్రస్తుతం కూటమి పాలనలో అవస్థల నడుమ పింఛన్లు పొందాల్సి వస్తోంది. మండలంలో 8,906 పెన్షన్లు ఉన్నాయి. మండలంలోని సచివాలయాల్లో బదిలీలు జరగడంతో ఉద్యోగులందరూ కొత్తగా వచ్చినవారే. ఒకటో తేదీ ఉదయం ఇంటికి పెన్షన్ డబ్బులు ఇవ్వాల్సి ఉండగా..తమకు అడ్రస్ తెలీదంటూ చాలా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది గ్రామంలో ఒకచోట కూర్చొని వృద్ధులు, వికలాంగులను సైతం వారి దగ్గరికి రప్పించి, క్యూలో నిలబెట్టి పెన్షన్ల పంపిణీ చేశారు. ఇక, రేణిగుంట పంచాయతీలోని ఒకటవ సచివాలయంలో ఉదయం 11 గంటల వరకు సిబ్బంది పెన్షన్ పంపిణీ చేయలేదు. పెన్షన్ దారులు సచివాలయం వద్ద వచ్చి పడిగాపులు కాసి ఆ తర్వాత పెన్షన్ డబ్బులు తీసుకుని వెళ్లారు. దీనిపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు వివరణ కోరగా.. గ్రామంలో ఒకచోట పెన్షన్లు పంపిణీ జరిగితే ఆన్‌లైన్లో తెలుస్తుందని, అలా చేసిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఒకటో తేదీ మండలంలో 94.42 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

కేంద్రమంత్రి సాదర స్వాగతం

రేణిగుంట: జాతీయ రోడ్డు రవాణా, రహదారుల శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సాదర స్వాగతం పలికారు. శుక్రవారం రాత్రి తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా పుణే నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడికి చేరుకున్న ఆయనకు ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రి జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, శ్రీనివాసులు, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

టోల్ వసూళ్లపై కేంద్రమంత్రికి ఫిర్యాదు

రేణిగుంట విమానాశ్రయంలో కేంద్రమంత్రి నితిన్ గట్కరీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు కలిశారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన టోల్ గేట్ వల్ల స్థానికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, టోల్ ఆపరేటర్ సాయి కంపెనీ యాజమాన్యం అధిక మొత్తంలో టోల్‌చార్జీలు వసూలు చేస్తోందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన టోల్ ఆపరేటర్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సామంచి తెలిపారు. ఆయనతోపాటు బీజేపీ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, కోలా ఆనంద్ తదితరులు ఉన్నారు.

చీరల అలంకారంలో ముత్యాలమ్మ




శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం 108 చీరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత అమ్మవారికి పలు అభిషేకాల అనంతరం చీరల అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి పనులకు..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భూమిపూజ చేశారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి గిరి ప్రదక్షిణ మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.7కోట్లతో శ్రీకారం చుట్టారు. అలాగే, పట్టణ శివారులోని అర్ధనారీశ్వరస్వామి ఆలయం నుంచి ముక్కంటి ఆలయ సన్నిధి వీధి వరకు శివంటు శివం రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల కోసం..!



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ముచ్చివోలు జెడ్పీ హైస్కూల్ టీచర్లు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం స్థానిక సంస్థల్లో పనిచేసే టీచర్ల సంఖ్య ఆధారంగా ఎంఈఓలు, డీవైఈఓలు, లెక్చరర్లు గాఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

అంతా పచ్చపాతం

వీఎస్ఎస్ చైర్మన్ ఎన్నిక వివాదాస్పదం

మండలంలోని క్రిష్ణంపల్లె వన సంరక్షణ సమితి(వీఎస్ఎస్) ఎన్నికను అటవీశాఖ అధికారులు రాజకీయ జోక్యంతో వివాదాస్పద రీతిలో ఎన్నుకున్నారు. నాలుగు నెలల కిందట ఏర్పడిన వీఎస్ఎస్ నూతన కమిటీని ఎలాంటి కారణాలు చూపకుండా ఎమ్మెల్యే ఒత్తిళ్లతో నిబంధనలకు విరుద్ధంగా రద్దు చేసి, టీడీపీ నాయకులతో కూడిన కొత్త కమిటీని ఏర్పాటు చేయడం విమర్శలకు తావిచ్చింది.

- 4 నెలల క్రితం గ్రామానికి చెందిన వ్యక్తి ఏకగ్రీవంగా ఎన్నిక
- ఎమ్మెల్యే ఆదేశాలతో ఆ ఎన్నికను రద్దు చేస్తూ మళ్లీ వీఎస్ఎస్ కమిటీ ఏర్పాటు
- రాజకీయ జోక్యంపై గత చైర్మన్ మండిపాటు



క్రిష్ణంపల్లెలో వీఎస్ఎస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు



వీఎస్ఎస్ కమిటీని రద్దు చేయాలని డీఎఫ్ఓకు ఎమ్మెల్యే రాసిన లేఖ

ఏర్పేడు: ఈ ఏడాది మార్చి 4న డీఆర్ఓ సికిందర్ పర్యవేక్షణలో గ్రామానికి చెందిన అక్కుపల్లి రవికుమార్‌ను చైర్మన్‌గా, ఆర్.సరోజను వైస్ చైర్‌పర్సన్‌గా, 15మంది కమిటీ సభ్యులను గ్రామంలో సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్రిష్ణంపల్లె ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో అటవీ అభివృద్ధి కార్యక్రమాలలో ఈ కమిటీ భాగస్వామ్యమవుతూ పలు కార్యక్రమాలను చేపట్టింది. అయితే వీఎస్ఎస్ చైర్మన్ అక్కుపల్లి రవికుమార్, కమిటీ సభ్యులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే నెపంతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వీఎస్ఎస్ కమిటీని రద్దు చేసి, కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని డీఎఫ్ఓకు గతనెల 18న లేఖ రాశారు. దీంతో డీఎఫ్ఓ నాలుగు నెలల కిందట ఏర్పాటు చేసిన కమిటీని ఎలాంటి కారణాలు చూపకుండా రద్దు చేశారు. క్రిష్ణంపల్లెలో శుక్రవారం డీఆర్ఓ సికిందర్, గౌస్‌కరీం, సర్పంచ్ గాదె రాజేశ్వరి పర్యవేక్షణలో వీఎస్ఎస్ ఎన్నికను నిర్వహించి, టీడీపీ అనుయాయులను ఎన్నుకున్నారు. పోలీస్ బందోబస్తు నడుమ అటవీ అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించడం గమనార్హం! దీంతో అటవీశాఖ అధికారుల వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్నాయి. ఎలాంటి కారణాలు చూపకుండా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఒత్తిళ్లకు తలొగ్గి తమ కమిటీని రద్దు చేయడం శోచనీయమని గత చైర్మన్ రవికుమార్ విమర్శించారు.

వీఎస్ఎస్ చైర్మన్‌గా ఎం.చంద్రశేఖర్

వన సంరక్షణ సమితి చైర్మన్‌గా ఎం.చంద్రశేఖర్, వైస్ చైర్‌పర్సన్‌గా జే.భూదేవి, మరో 15మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధికారం కోసమే మాయమాటలు



కాటూరులో క్యూఆర్ కోడ్ పోస్టర్ చూపుతున్న నూకతోటి రాజేష్

- ప్రజలను నిలువునా ముంచిన బాబు
- ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు
- 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ'లో నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: ఎన్నికల సమయంలో ఓట్లు పొందడం, అధికారంలోకి రావడమే లక్ష్యంగా చంద్రబాబు మాయమాటలు చెప్పారని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. శుక్రవారం కాటూరు గ్రామంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. పార్టీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు, యూత్ నేత చికోలు అశోక్ ఆధర్యంలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. నూకతోటి రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారం కోసం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారన్నారు. దీంతో ఆయనను నమ్మి ఓట్లేసిన ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, తొలి నుంచి చంద్రబాబు చెప్పింది చేయడని స్పష్టం చేశారు. అయితే ప్రజలను మాయమాటలతో మోసం చేయడంలో దిట్ట అని తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. ప్రజలకు ఇచ్చిన బ్రోచర్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు మోసాలు తేటతెల్లమవుతాయని వెల్లడించారు.

సూపర్ సిక్స్ పథకాలేవీ?

కూటమి నాయకులు ఎన్నికల సమయంలో తల్లికి వందనం పథకం ద్వారా బడికెళ్లిన ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆరోపించారు. అర్హులైన చాలా మందికి ఈ పథకం వర్తించలేదన్నారు. అలాగే దీపం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఇలా ప్రతి పథకాన్ని చంద్రబాబు ఆటకెక్కించారని విమర్శించారు. ఓట్ల కోసం సూపర్‌సిక్స్‌తో మోసం చేసిన చంద్రబాబుకు అవకాశం వచ్చినప్పుడు ఓటుతో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురునాథం, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, స్థానిక నేతలు తిరుమలశెట్టి మురళి, గౌతమ్, హరి, చెంచురాజా, ధనంజయ, వెంకటేష్, మణి, లోకేష్, రాఘవ, హేమచంద్రారెడ్డి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

'స్కౌట్స్'తో విద్యార్థులకు క్రమశిక్షణ





విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయుడు, శ్రీకాళహస్తి: బాబు అగ్రహారం మున్సిపల్ హైస్కూల్లో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్కౌట్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ప్రపంచ స్కార్ఫ్ డేను స్కౌట్ మాస్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులు మంచి నైపుణ్యాలను సంపాదించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. బాడెన్ పావెల్ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం స్కౌట్స్‌లో ప్రవేశం కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులను ఉపాధ్యాయుడు ధనుంజయ అభినందించారు. కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ జయశ్రీ, పాల్గొన్నారు.

ఘనంగా స్కార్ఫ్ డే

శ్రీకాళహస్తి: స్థానిక బాబు అగ్రహారం మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం ప్రపంచ స్కార్ఫ్ డేను సౌట్స్ అండ్ గైడ్స్ ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీదేవికి స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్ స్కార్ఫ్ వేసి, దాని విశిష్టత వివరించారు. కార్యక్రమంలో స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ పింఛన్ కష్టాలు



నాగలాపురంలో పింఛన్ల పంపిణీ

నాగలాపురం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ పంపిణీ చేసేవాడు. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత ఇక్కట్లు తప్పడం లేదు. శుక్రవారం సైతం పింఛన్ కష్టాలు తలెత్తాయి. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లకుండా పండుటాకులను సైతం ఒకచోటుకు రప్పించి పెన్షన్లు పంపిణీ చేశారు. నాగలాపురం వెస్ట్ దళితవాడలోని ఓ ఆలయం వద్దకు లబ్ధిదారులను పిలిపించి సచివాలయ సిబ్బంది పింఛన్లు ఇచ్చారు. వృద్ధులు పెన్షన్ తీసుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. దీంతో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు పడుతూ లేస్తూ వెళ్లాల్సి వచ్చింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇంటి వద్దకే పింఛన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



అనధికార బార్లు..!



రేణిగుంట సమీపంలోని మద్యం దుకాణం ఆవరణలో మందు సేవిస్తున్న మందుబాబులు

రేణిగుంటలోని మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లు బార్లను తలదన్నేలా దర్శనమిస్తున్నాయి. మండలంలోని పలు మద్యం షాపుల్లో పెద్ద పెద్ద షెడ్లు వేసి బార్‌ను తలపించేలా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం నుంచి మద్యం షాపు సమీపంలోని బహిరంగ ప్రదేశంలో కుర్చీలు, బెంచీలు వేసి మద్యం తాగిస్తున్నారు. షాప్ పక్కనే దాబాను తలపించేలా తిను బండారాలను ఏర్పాటు చేసి అధిక ధరలతో అమ్ముతూ మందుబాబుల జేబులను గుల్ల చేస్తున్నారు. పర్మిట్ రూములకు ఎలాంటి అనుమతులు లేకపోయినా సంబంధిత అధికారులకు నెలసరి మామూళ్లు ఇస్తూ తమ ఇష్టానుసారంగా మద్యం తాగిస్తున్నారు. ఎక్సైజ్ సీఐ నరసనాయుడుని వివరణ కోరగా.. మార్చి నుంచి ఇప్పటివరకు 48 కేసులు నమోదు చేశామని, 36 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేశామని అన్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు పర్మిట్ రూములకు అనుమతి లేదని తెలిపారు. ఎవరైనా పర్మిట్ రూములు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. –రేణిగుంట

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండల విద్యార్థుల ఎంపిక





రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన పల్లం విద్యార్థులు, విద్యార్థులను అభినందిస్తున్న వార్డెన్ రవి

ఏర్పేడు: తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించిన జిల్లా జూడో చాంపియన్‌షిప్ జూడో సబ్ జూనియర్ పోటీలలో మండలంలోని పల్లం, పాపానాయుడుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎంలు తీగల ఆనంద్, మారయ్య తెలిపారు. పల్లం విద్యార్థులలో నలుగురు గోల్డ్ మెడల్, 9 మంది సిల్వర్ మెడల్ సాధించగా, పాపానాయుడుపేట హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు గోల్డ్, ఏడుగురు సిల్వర్, ముగ్గురు బ్రాంజ్ మెడల్‌లను సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఆగస్టు 8వ తేదీ గుంటూరులో అంతర్ జిల్లాల జూడో సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. ఎంపికైన వారిని పీఈటీలు వాణి, సోమశేఖర్, పుష్పవాణి అభినందించారు. అలాగే, పల్లం సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ఆర్.హర్షవర్ధన్(9వ తరగతి), కవల సోదరులు కె.రాము(8వ తరగతి), కె.లక్ష్మణ్(8వ తరగతి) ఇవే పోటీలకు ఎంపిక కావడంతో విద్యార్థులకు వార్డెన్ రవి అభినందించారు.

అ'పూర్వ' సమ్మేళనం



శ్రీసిటీ (సత్యవేడు): ట్రిపుల్ ఐటీ– శ్రీసిటీ 9వ స్నాతకోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాల ఆవరణలో 2025 పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుత గ్రాడ్యుయేట్లు, పూర్వ విద్యార్థులు, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవీ కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేకాంశంగా ట్రిపుల్ ఐటీ–శ్రీసిటీ పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను ప్రారంభించారు. ప్రతి బ్యాచ్ నుంచి ఇద్దరు ప్రతినిధులను ఎంపిక చేశారు. విద్యావేత్తలు, పరిశోధనలు, పరిశ్రమల సహకారం కోసం విద్యార్థులను ప్రోత్సహించాలని నిర్ణయించారు.

తల్లి పాలలో ఔషధ గుణాలు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ యమున



రామిరెడ్డిపాళెంలో మాట్లాడుతున్న వైద్యాధికారి పవన్‌కుమార్

బుచ్చినాయుడుకండ్రిగ: తల్లిపాలలో ఔషధ గుణాలు ఉంటాయని, పుట్టిన వెంటనే శిశువుకు తప్పని సరిగా అమ్మ పాలు తాగించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు యమున, జ్యోతి తెలిపారు. శుక్రవారం మండలంలోని నీర్పాకోట ఎస్టీ కాలనీలో తల్లి పాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.వారు మాట్లాడుతూ టైఫాయిడ్, కామెర్లు, తదితర వ్యాధులను నిర్మూలించే ఔషధ గుణాలు తల్లి పాలలో ఉన్నాయని, బిడ్డ బరువు పెరిగేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు దోహద పడతాయని వివరించారు. తల్లి ఒడిలో వేడి బిడ్డకు చేరి వ్యాధులు దరిచేరకుండా రక్షణ కల్పిస్తుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రె పాలను తాగిస్తే శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాలు ద్వారా వెల్లడైందని వెల్లడించారు. ప్రస్తుతం అనేక మంది తల్లులు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని, అందుకు కారణం బిడ్డలకు పాలు ఇవ్వకపోవడమేనని పరిశోధనల్లో వెలుగు చూసిందని తెలిపారు.

అమ్మపాలు అమృతంతో సమానం

వరదయ్యపాళెం: అమ్మ పాలు అమృతంతో సమానమని, శిశువు ఆరోగ్యం పెంచడంలో కీలకమని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రామిరెడ్డిపాళెంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రవీంద్రుడు, సూపర్‌వైజర్ పవనకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శిల్ప, ఏఎన్ఎం కామేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ బీబీ పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

రేణిగుంట: మండలంలో వెంకటాపురం సెక్టార్‌లోని ఎస్‌యూ పురం, కృష్ణాపురం, ఆర్.మల్లవరం, కుమ్మరపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాల వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరిస్తూ సీడీపీఓ కృష్ణవేణి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమావతి, అంగన్వాడి కార్యకర్తలు తల్లులు పాల్గొన్నారు.



రేణిగుంట: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



అంజిమేడులో తల్లిపాల వారోత్సవ ర్యాలీలో సీడీపీఓ కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రీరామరక్ష

ఏర్పేడు: తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని అంజిమేడు, పల్లం అంగన్‌వాడీ కేంద్రాలు శుక్రవారం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించాయి. ఆమె మాట్లాడుతూ, తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే పోషకాలు సమృద్ధిగా ఉన్నాయని, పిల్లలకు పోత పాలు కాకుండా తల్లిపాలే పట్టించాలని ఆమె తల్లులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పి.హేమావతి, కె.రత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణలత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు: స్థానిక పాలిటెక్నిక్‌లో వివిధ కోర్సులకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లు కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, కళాశాలలో ఈసీఈలో 46, మెకానిక్ ఇంజినీరింగ్– 62, సివిల్ ఇంజినీరింగ్– 63, సివిల్ ఇంజినీరింగ్– 63 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. దరఖాస్తుతోపాటు విద్యార్థులు పాలిసెట్–2025 హాల్ టికెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కుల లిస్టు, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్ల రెండు సెట్లు జిరాక్సు కాపీ జతపరచాలని వివరించారు. ఈ నెల 4వ తేదీ లోపు కళాశాలకు దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. ట్యూషన్ ఫీజు రూ.4,700, దరఖాస్తు రుసుము రూ.400, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.750 చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే ట్యూషన్ ఫీజు రూ. 4,700, దరఖాస్తు ఫీజు రూ. 200, రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250 చెల్లించాలని సూచించారు. 5వతేది ఉదయం 9గంటలకు నుంచి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.

శేష వాహనంపై వీరభద్రుడు



ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

నారాయణవనం: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ఉత్సవర్లు శేషవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం సుగంధ పుష్పమాలికలు, పట్టు వస్త్రాలను ధరించిన వీరభద్రుడు కోటవీధి, సెంగుందర్ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. శనివారం రాత్రి భక్తుల అగ్నిగుండ ప్రవేశం అనంతరం ఉత్సవమూర్తి పులి వాహనంపై ఊరేగనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.